నల్లా కనెక్షన్ ఇచ్చినా నీళ్లత్తలేవు

- కనగర్తి, అంకుషాపూర్ గ్రామాలకు అందని మిషన్ భగీరథ నీరు
- మూడేళ్లుగా చుక్క నీరు రాక అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు..పాలకులు

ఇల్లందకుంట: ఉమ్మడి జమ్మికుంటలోని కనగర్తి, అంకుషాపూర్ గ్రామాలకు ఇప్పటివరకు మిషన్ భగీరథ నీరు రావడంల లేదు. జమ్మికుంట మండలంగా ఉన్నప్పుడు ఇల్లందకుంటలో మినీ రిజర్వాయర్ పనులు చేపట్టి ఇక్కడి నుంచే శుద్ధజలం ప్రజలకు అందించాలనే లక్ష్యంతో పది గ్రామాలకు భూగర్భపైపులైను వేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో కొత్త పైపులైను వేయకుండా పాత పైపులైను చూపెట్టి కొత్త పైపులైను వేసినట్లు దొంగ బిల్లులు పెట్టి లక్షల బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు.

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా...

ఇల్లందకుంట మండలంలోని కనగర్తికి పూర్తిగా జమ్మికుంట మండలంలోని మడిపల్లి ,అంకుషాపూర్ గ్రామాలకు ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నామమాత్రంగా నీరు సరఫరా అవుతోంది. ప్రతి ఇంటికి భగీరథ అధికారులు నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పటికీ నీరు సరఫరా చేయడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందిస్తున్నా సరిపడా రావడంలేదని విమర్శలు వెలువడుతున్నాయి. కొన్ని గ్రామాలలో సరిపడా మంచి నీరు అందింకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పైపులైను ధ్వంసం......

ఆర్అండ్బీ అధికారుల నిర్లక్ష్యంతో రెండేళ్ల క్రితం గ్రామంలోని ప్రధాన రోడ్డు నిర్మిచే క్రమంలో మిషన్ భగీరథ పైపులైన్ను ఇష్టానుసారంగా తవ్వి ధ్వసం చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పైపులైన్ వ్యవస్థ అస్తవ్యస్థమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



నిరుపయోగంగా నల్లా



రోడ్డు పక్కన మిషన్ భగీరథ నల్లా పైపులు

నీళ్లు వస్తలేవు



ఇప్పటివరకు మిషన్ భగీరథ నీళ్లు రాలేదు. గ్రామంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ అధికారులు వాటి గూర్చి మర్చిపోయారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే నీళ్లు వస్తున్నాయి. భగీరథ నీళ్లు వచ్చేట్లు అధికారులు చర్యలు చేపట్టా – **దరుగుల పోచయ్య, కగనర్తి గ్రామం**

అధికారులకు నివేదిక పంపాం

రోడ్డు నిర్మాణ క్రమంలో పైపులైన్ ధ్వంసమైంది వాస్తవమే. కొత్త పైపులైన్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. మిషన్ భగీరథ నీళ్లను పాతలైన్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. కనగర్తి గ్రామం ఎత్తు ప్రాంతంలో ఉండటం వల్ల లో ప్రెజర్తో నీళ్లు వస్తున్నాయి.

– **వసియొద్దీన్, డీఈ**

క్లుప్తంగా

తాటివనం దగ్ధం



నిప్పంటుకొని దగ్ధమవుతున్న తాటివనం

జమ్మికుంట: పట్టణంలోని నాయిని చెరువు కట్టపై ఉన్న తాటివనం దగ్ధమైంది. స్థానికులు, గీత కార్మికులు తెలిపిన వివరాలు.. కట్ట కింద ఉన్న తుంగకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గాలులకు తాటివనంలోకి మంటలు వ్యాపించాయని, ఈత, తాటిచెట్లు కాలిపోయాయి. హుజూరాబాద్ నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పివేసిందని, విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి అప్రమత్తంగా వ్యవహరించారని అన్నారు. తాటివనం కాలిపోవడంతో జీవనోపాధి కోల్పోయామని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ముగ్గురిపై కేసు

జమ్మికుంట: దాడి ఘటనలో ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. పట్టణంలోని ఓ బిర్యానీ సెంటర్లో పని చేస్తున్న అశోక్ను మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన అజయ్, రాచపల్లి శ్రీకాంత్, గోపగాని సందీప్ బిర్యానిలో చికెన్ పీసులు వేయలేదని దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

‘ప్రణవ్ను విమర్శిస్తే సహించం’

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితెల ప్రణవ్ను విమర్శించడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అంతర్గంతగా చర్చించుకోవాల్సిన పార్టీ విషయాలను బహిరంగంగా చెప్పడం తగదని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన జమ్మికుంట మండల కాంగ్రెస్ నాయకులపై పార్టీ చర్యలు తీసుకోవడం శుభపరిణామమని, పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తించినవారిపై ఇలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంగాడి రాజిరెడ్డి, చదువు జయపాల్రెడ్డి, పైడికుమార్, తిరుపతయ్య, మ్యాక వీరయ్య, ఒడ్డపల్లి కొంరయ్య, పత్తి సమ్మిరెడ్డి, మాసాడి చొక్కరావు, వావిలాల సత్యనారాయణ, కోమాల్రెడ్డి తదితరులు ఉన్నారు.

‘అనుమతి లేకుండా స్కూళ్లు ప్రారంభించొద్దు’

రామడుగు: ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలో పాఠశాలలు ప్రారంభిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ ప్రకటనలో తెలిపారు. హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్రోచర్స్తో ప్రచారం చేయొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చొప్పదండి: ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు పాఠశాలలను ప్రారంభించొద్దని ఎంఈవో వేణుకుమార్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. హోర్డింగ్, ఫ్లెక్సీ, బ్రోచర్స్, ఆన్లైన్, ఆఫ్లైన్లో ప్రచారం నిర్వహించొద్దని జిల్లా విద్యాధికారి ఆదేశాలు జారీ చేశారు. విద్యా సంవత్సరానికి ముందే విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించినా, పాఠశాలలను ప్రారంభించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్పై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

కరీంనగర్ కార్పొరేషన్: ఫోన్ ట్యాపింగ్కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్రెడ్డికి ఫిర్యాదు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్లో నిందితుడైన రాధాకిషన్రావు వాంగ్మూలంలో తెలిపిన ప్రకారం తన ఫోన్ ట్యాపింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హరీశ్రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేయడం జరిగిందని రాధాకిషన్రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, సంతోష్రావుతో పాటు బాధ్యులైన ప్రతిఒక్కరికీ నోటీసులు అందజేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్టౌన్: నగరంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలో సోమవారం ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్క్రాస్ సొసైటీ సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ తరచూ ప్రమాదాల బారిన పడి, తీవ్ర అనారోగ్య సమస్యలతో రోగాల బారిన పడి చికిత్స సమయంలో రక్తం అందక రోగులు మృత్యువు బారిన పడుతున్నారని అన్నారు. ఆరోగ్యవంతులు, యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

ఎన్ఎస్యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

హుజూరాబాద్రూరల్: ఎన్ఎస్యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హుజురాబాద్కు చెందిన గండు ప్రశాంత్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. కార్యదర్శిగా ఎంపిక చేసిన వారి నమ్మకాన్ని నిలబెడతానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రూ. 25వేల విరాళం



చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన ట్రస్టుకు పట్టణానికి చెందిన పబ్బతి పద్మ, శ్రీనివాస్ దంపతులు సోమవారం రూ. 25,116 విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్కు విరాళం అందించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేసి ఖాతా తెరిచామని, ట్రస్టుకు ఇప్పటికే దాతలు ముందుకు వచ్చారని వారి నుంచి విరాళాలు సేకరించి అన్నదాన ట్రస్టును బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చేపూరి సత్యనారాయణ, బొడిగె వెంకటేశ్, చెట్టిపెల్లి దామోదర్, బత్తిని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఆలయం ముందు వెలిసిన దుకాణాలు



పూజల్లో రాజేందర్రావు, శ్రీనివాస్రావు,స్వాములు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం వేకువ జామున ఆలయ పూజారులు శేషం సత్యనారాయణచార్యులు, శ్రీనివాసాచార్యులు, సుధీర్చార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను రథంపై డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు ఊరేగించారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులుగా ఆలయం ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రథోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో తాగునీరు, చలువపందిళ్లు, వైద్యసౌకర్యం కల్పించామని ఈఓ రాజ్కుమార్ తెలిపారు. చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గందె సంపత్కుమార్, క్లర్క్ కవిత, సింగిల్విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

హనుమాన్ అభిషేక పూజ

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు ఇంట్లో సోమవారం హనుమాన్ అభిషేక పూజ నిర్వహించారు. కరీంనగర్లోని అల్కాపురికాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్రావు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు 400 మంది హనుమాన్ దీక్షస్వాములు పూజలో పాల్గొని భక్తి పాటలతో కనువిందు చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న బోనాలు

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, లక్ష్మాజీపల్లి గ్రామాలలో సోమవారం భీరన్న ఉత్సవాల్లో భాగంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య బీరన్న ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితెల ప్రణవ్ హాజరై మాట్లాడారు. కుల, గ్రామ దేవతలను పూజించడం వల్ల ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో వొడితెల ప్రణవ్

విత్తనాల కొనుగోలుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల, నల్లగొండ, బాలయ్యపల్లె, రేణిగుంట గ్రామాల రైతులకు విత్తనాల కొనగోలుపై వ్యవసాయాధికారులు సోమవారం అవగాహన కల్పించారు. కొనుగోళ్లప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఈవో స్వామి వివరించారు. రైతులు కొనే విత్తనాలకి సంబంధించిన రశీదు తీసుకోవాలని లైసెన్స్డ్ విత్తన డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. తీసుకున్న బిల్ మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్, లాట్ నెంబర్, రేటు వున్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్ తయారీ తేదీ చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, జీపీ కార్యదర్శులు, సొసైటీ సీఈవో చొక్కా రెడ్డి పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలకు కొరతలేదు

చిగురుమామిడి: మండలంలోని రైతులకు జీలుగ విత్తనాల కొరతలేదని, ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు 80 క్వింటాళ్ల పంపిణీ చేశారని, మరో 50 క్వింటాళ్ల రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని జెడ్పీటీసీ, జెడ్పీఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. జీలుగ విత్తనాల కొరతపై జిల్లా ఇన్చార్జి వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్తో ఫోన్లో మాట్లాడినట్లు చెప్పారు. సబ్సిడీపై రైతులకు కావాల్సిన విత్తనాలు డీసీఎంఎస్ కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ప్రతి ఇచ్చి పొందవచ్చన్నారు. ఖరీఫ్లో పంటల సాగుబడిని ఎన్నికల కౌంటింగ్ అనంతరం నిర్వహిస్తామని తెలిపారు.

ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి



మధుసూదన్కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామ పంచాయతీలు పారిశుధ్య సిబ్బంది, కారొబార్లు, బిల్ కలెక్టర్లకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నాయని, నెలనెలా ట్రాక్టర్లకు కిస్తులు చెల్లించలేక ఢీలా పడిపోయిన జీపీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు సోమవారం చిగురుమామిడి ఎంపీడీవో మధుసూధన్కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. గ్రామాల్లో రూ.లక్షల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటినా నిధులు విడుదల చేయలేదని, సర్పంచులు లేక ప్రత్యేకాధికారుల పాలనలో జీపీల నిర్వహణ భారమవుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా నాయకులు మురళిమనోహర్, మండల ఉపాధ్యక్షుడు కంది శంకర్, మాజీ అధ్యక్షుడు అచ్చ రవీందర్, బీజేవైఎం హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు జి సతీశ్, ముంజ చంద్రయ్య, వెంకటస్వామి, నిమ్మ రమాకాంత్రెడ్డి, సంపత్, మొగిలి పాల్గొన్నారు.

శిఖం భూమి కబ్జాపై కలెక్టర్కు ఫిర్యాదు



చదును చేసిన కుంట శిఖం భూమి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలోని సర్వే నంబర్ 368లో కుంట శిఖం భూమి కబ్జాకు గురైందని వార్డు కౌన్సిలర్ బొంగోని వీరన్న సోమవారం కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. కుంట మధ్య నుంచి జమ్మికుంట, వావిలాల రోడ్డును 1965లో వేశారు. దీంతో కుంటలో నీటి నిల్వ చేయలేదు. ఆర్అండ్బీ రోడ్డుకు ఇరుపక్కల కుంట శిఖం భూమి 33 గుంటల వరకు ఉంటుంది. మేన్రోడ్డులో శిఖం భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, గజం రూ. 20వేలకు పలుకుతుండగా మొత్తం భూమి విలువు రూ. కోట్లలో ఉంటుందని, ఆ భూమిలో మొరం పోసినప్పుడే తహసీల్దార్కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కుంట శిఖం భూమికి హద్దులు నిర్ణయించి, ఆక్రమణకు గురికాకుండా కాపాడలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, ఖాదర్గూడెం, పెద్దూర్పల్లి, ఈదుల గట్టెపల్లి గ్రామాలకు మంగళవారం ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెంజర్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ ఎం. రమేశ్ సోమవారం తెలిపారు. నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల ఏర్పాటు దృష్ట్యా, సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ప్రకటనలో కోరారు.

హుజూరాబాద్రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి సెక్షన్లోని 11కేవీ ఇప్పలనర్సింగాపూర్ ఫీడర్ లైన్మెయింటెనెన్స్ నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కనుకుల రాజుకు డాక్టరేట్

ఇల్లందకుంట: మండలంలోని మల్లివానిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కనుకుల శ్రీనివాస్రెడ్డి,రాధ దంపతుల కుమారుడు కనుకుల రాజు ప్రపంచంలోనే అత్యుత్తమ మోనాశ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందాడు. హృదయనాళ, రక్తపోటుపై పరిశోధన చేసినందుకు గౌరవం లభించింది. అన్ని కష్టాలను ఎదుర్కొంటూ ఊహించలేని విజయాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారసంతలో వసతులు కల్పించాలి



ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న నాయకులు

గన్నేరువరం: మండల కేంద్రంలోని వారసంతలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు సోమవారం ఎంపీడీవో శంకర్కు మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. మూత్రశాలలు లేక మహిళలు ఇక్కట్లు పడుతున్నారని, వ్యాపారులు, వినియోగదారులకు వారసంతలో వసతులు కల్పించేంత వరకు అన్నిటెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి శ్రీశైలం, యువజన నాయకులు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం చెట్లను కాపాడాలి



చెట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: పల్లె ప్రకృతి వనంలో భాగంగా పెంచిన చెట్లను కాపాడాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ నరేందర్తో కలిసి సోమవారం మండలంలోని రుక్మాపూర్ శివారులోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, బృహత్ ప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రుతుస్రావ దినోత్సవంలో పాల్గొన్నారు. బాలికలు, యువతులు పోషకాహారంపై దృష్టి సారించాలని, నెలసరిలో ఇబ్బందులు ఉన్న వారు చొప్పదండిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెహతాబ్, అంజలి, లక్ష్మి, మంగ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలి

చిగురుమామిడి: రాష్ట్రంలోని మత్స్యకారులందరూ ఆర్థికంగా బలోపేతం కావాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. సోమవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కూనచ్చుల మహేందర్, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మాల కనక ముదిరాజ్, ఉమెన్ ఫిషరీస్ సొసైటీ కంపనీ అధ్యక్షురాలు మాల మంజుల ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, మహిళా కాంగ్రెస్ చిగురుమామిడి మండల అధ్యక్షురాలు పోలు స్వప్న ముదిరాజ్, చిగురుమామిడి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చెరుకు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

‘పంచవర్ష ప్రణాళికల రూపకర్త నెహ్రూ’



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: దేశ తొలి ప్రధానిగా జవహర్లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి, దేశ ఆర్థిక పటిష్టానికి బాటలు వేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిండి గింజలు లేక జనం అల్లాడుతున్న ఆ కాలంలో తన ముందు చూపుతో దేశంలో భారీ సాగునీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్రెడ్డి, పద్మాకర్రెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణనాయక్, కొరివి అరుణ్ కుమార్, ఎలగందుల మల్లేశం, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, కల్వల రామచందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, రామిడి రాజిరెడ్డి, సలీముద్దీన్, కుంభాల రాజకుమార్, వన్నెం రజిత, పర్వత మల్లేశం, దీకొండ శేఖర్, జొన్నల రమేశ్, నెల్లి నరేశ్, మాదాసు శ్రీనివాస్, మామిడి సత్యనారాయణరెడ్డి, హాజీ, శ్రీరాముల రమేశ్, శిల్ప,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి వర్ధంతి



హుజూరాబాద్రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ధర్మపత్ని రమాబాయి అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ చైర్మన్ ఖలీద్ హుస్సేన్, నాయకులు రత్నం, జనార్దన్, బాబు, సదానందం, సుమన్, శ్రీనివాస్ పటేల్, రామచంద్రం, వసంత్, శంకర్, ఓదెలు తదితరులు ఉన్నారు.